


ఇద్దరు వీఆర్వోల సస్పెన్షన్

పార్వతీపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాలూరు, సీతంపేట మండలాల పరిధిలో శివరాంపురం, పులిపుట్టి సచివాలయాల వీఆర్వోలు చిన్నయ్య, అప్పయ్యలను సస్పెండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. మ్యూటేషన్ల పరిష్కారంలో అలసత్వం, అర్జీలను పెండింగ్‌లో ఉంచిన కారణంగా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేమని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

లెక్క తేలేదెప్పుడు?

- దివ్యాంగ పింఛన్ల పరిశీలనకు పలువురు డుమ్మా
- తనిఖీలకు అంతంతమాత్రంగానే హాజరు
- అనర్హుల్లో టెన్షన్.. టెన్షన్..



పార్వతీపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగ పింఛన్ల తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో ప్రధాన ఆసుపత్రులు కిటకిట లాడుతున్నాయి. అయితే పూర్తిస్థాయిలో లబ్ధిదారులు హాజరుకావడం లేదు. అత్యధికులు పింఛన్ల పరిశీలనకు డుమ్మా కొడుతున్నారు. దీంతో ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుంది.. ఇంకెప్పటికి అనర్హుల లెక్క తేలుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఇదీ పరిస్థితి..

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలువురు అనర్హులు అడ్డదారిలో సదరం పత్రాలు పొందారు. వలంటీర్లు, వైసీపీ నేతల అండదండలతో దివ్యాంగ పింఛన్లు పొందారు. కొన్ని మండలాల్లో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య 434 వరకు ఉందంటే అనర్హులు ఏ స్థాయిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్హులకు న్యాయం చేయాలంటూ ప్రజా పరిష్కార వేదికకు అర్జీలు అందాయి. దీనిపై దృష్టి సారించిన కూటమి సర్కారు దివ్యాంగ పింఛన్ల పరిశీలనకు ఆదేశించింది. ఈ మేరకు గత నెల 22న ప్రత్యేక వైద్య బృందాన్ని నియమించింది. తొలి విడతగా రూ.15వేలు పింఛన్ పొందిన దివ్యాంగులను వారు పరిశీలించారు.
- రెండో విడతలో భాగంగా రూ.6 వేలకు పైగా పింఛన్లు పొందుతున్న దివ్యాంగులపై అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు గత నెలాఖరున ప్రత్యేక తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రాలు పొందిన వారి వివరాలతో పాటు వికలాంగత్వాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.
- చెవి, ఆర్థోకు సంబంధించి పాలకొండ ఏరియా ఆసుపత్రిని కేటాయించారు. పలు మండలల వారికి ఆ ఆసుపత్రిలో ఈ నెల 5 నుంచి తనిఖీలు ప్రారంభమయ్యాయి. సచివాలయాల వారీగా విడుదల చేసిన జాబితా ప్రకారం ఈ నెల 25వ తేదీ వరకు వారు ప్రత్యేక తనిఖీ శిబిరాలకు వెళ్లాల్సి ఉంది. అయితే గతంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిలో ఆందోళన మొదలైంది. పింఛన్ ఉంటుందో, ఊడుతుందోనని టెన్షన్ పడుతున్నారు.
- జిల్లాలో దివ్యాంగ పింఛన్‌దారులు 16,667 మంది వరకూ ఉన్నారు. వారికి ప్రతినెలా ప్రభుత్వం రూ.10 కోట్ల 17 లక్షల మేర అందిస్తోంది. ప్రస్తుతం వారందరి ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆరోగ్యాలను పరిశీలించాల్సి ఉంది. అయితే రోజుకు 250 మంది చొప్పున ఇప్పటి వరకు 2,684 మందిని మాత్రమే వైద్యులు పరిశీలించారు. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి, కురుపాం సీహెచ్‌సీ, పాలకొండ, సీతంపేట, సాలూరు ఏరియా ఆసుపత్రుల్లో వారానికి మూడు రోజుల పాటు వైద్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గతంలో దివ్యాంగులు పొందిన ధ్రువీకరణ పత్రంలో పొందుపరిచిన వికలాంగత్వం శాతం వాస్తవమా.. కాదా.. అన్నది తేల్చాల్సి ఉంది. అదేవిధంగా దివ్యాంగ పింఛన్లకు వారెంత వరకు అర్హులన్నది వెల్లడించాల్సి ఉంది.
- దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారందరూ తనిఖీలకు తప్పనిసరిగా హాజరు కావాలని సంబంధిత సచివాలయాల సిబ్బంది లబ్ధిదారులకు పిలుపునిస్తున్నారు. అయితే ఇప్పటివరకు సుమారు 3,200 మందికి సమాచారం అందిస్తే.. ఇందులో 2,684 మంది తనిఖీలకు హాజరయ్యారు. కాగా సోమవారం రావివలస నుంచి 93 మంది దివ్యాంగ పింఛన్‌దారులు పాలకొండ ఆసుపత్రికి వెళ్లారు.


కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం


గరుగుబిల్లి: తనిఖీల కోసం పాలకొండ ఆసుపత్రికి వచ్చిన రావివలస దివ్యాంగ పింఛన్‌దారులు

దివ్యాంగుల పింఛన్లు ఇలా..

సాలూరు రూరల్	851
సాలూరు టౌన్	693
బలిజిపేట	1312
సీతంపేట	434
సీతానగరం	2,025
వీరఘట్టం	908
గుమ్మలక్ష్మీపురం	444
గరుగుబిల్లి	11,183
భామిని	602
జియ్యమ్మవలస	1208
కొమరాడ	954
కురుపాం	609
పాచిపెంట	681
మక్కువ	1329
పాలకొండ రూరల్	65
పాలకొండ టౌన్	370
పార్వతీపురం రూరల్	1623
పార్వతీపురం టౌన్	786

2,684 మంది హాజరు

జిల్లాలో దివ్యాంగుల పింఛన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుంది. మొత్తంగా 16,667 మంది లబ్ధిదారులు ఉండగా.. ఇప్పటివరకు 2,684 మంది హాజరయ్యారు.
- సత్యంనాయుడు, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ

వసతి గృహాలకు మరమ్మతులు

- రూ.1.88 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని పలు వసతి గృహాలు కొత్త రూపును సంతరించుకోనున్నాయి. విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి. వాటి మరమ్మతులకు అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వం హయాంలో వసతిగృహాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించినా వైసీపీ ప్రభుత్వం వాటి నిర్వహణను గాలికొదిలేసింది. మరమ్మతులపై దృష్టి సారించలేదు. దీంతో సరైన సౌకర్యాలు లేకపోవడంతో కొన్నాళ్లుగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం జిల్లాలోని పదకొండు ఎస్సీ, బీసీ వసతి గృహాల మరమ్మతులకు రూ.1.88 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న వసతి గృహాల్లో పనులు ప్రారంభ మయ్యాయి. కాగా ఈ పనులను వసతి గృహ సంరక్షణాధికారులు పర్యవేక్షించాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారిత అధికారి మహమ్మద్ గయజుద్దీన్ ఆదేశించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు సంతృప్తికరంగా లేకుంటే బిల్లుల చెల్లింపులు జరగవని వెల్లడించారు.


రావివలస ఎస్సీ బాలుర వసతి గృహం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి

పదిమంది నామినేషన్

- నేడు నామినేషన్ల పరిశీలన
- ఉపసంహరణకు 13 వరకూ గడువు
- 27న పోలింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం గడువు ముగిసే సమయానికి పది మంది నామినేషన్ వేశారు. చివరిరోజు ఇద్దరు (పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు) మూడు సెట్ల వంతున నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం అభ్యర్థులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరేంధిరప్రసాద్ ప్రమాణం చేయించారు. ఈనెల 27న జరగనున్న ఎన్నికలకు ఈ నెల మూడో తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. మొత్తం పది మంది అభ్యర్థులు...సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, కోరెడ్ల విజయగౌరి, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, గాదె శ్రీనివాసులనాయుడు, పోతల దుర్గారావు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన చేస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 13 వరకూ గడువు ఉంది. ఈ ఎన్నిక పార్టీ రహితంగా జరుగుతుంది. అందుకే బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించరు. బ్యాలెట్‌పై పేరు, ఫొటో మాత్రమే ఉంటాయి.


సుంకి సమీపంలోని తోటల్లో సంచరిస్తున్న ఏనుగులు

సుంకిలో గజరాజులు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలవాసులకు గజరాజుల బెడద తప్పడం లేదు. నిన్నమొన్నటి వరకు తోటపల్లి పంచాయతీ నందివానివలసలో సంచరించిన ఏనుగులు సోమవారం సుంకిలో దర్శనమిచ్చాయి. దీంతో ఆ గ్రామస్థులు హడలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నెల రోజుల కిందట అరటి, మొక్కజొన్నతో పాటు వ్యవసాయ పరికరాలు, పైపులు, మోటార్లను ధ్వంసం చేసిన గజరాజులు మళ్లీ ఈ ప్రాంతం రావడంపై గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అటవీశాఖాధికారులు స్పందించి ఏనుగులను తరలించే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఇది ఇసుకాసురుల పాపమే

- వంశధారలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు.. గుంతలో పడి వృద్ధుడి మృతి

భామిని, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇసుక గుంత ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. నదీ స్నానానికి వెళ్లిన వృద్ధుడి ఉసురు తీసింది. భామిని మండలంలో చోటు చేసుకున్న ఘటన అందర్నీ కలవరపరుస్తోంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బిల్లుమడ గ్రామానికి చెందిన కోటిలింగాల చొక్రో (64) రోజూలానే సోమవారం కూడా వంశధార నదికి స్నానానికి వెళ్లాడు. అయితే ఆ ప్రాంతంలో పెద్దఎత్తున ఇసుకను తరలించడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. అది గమనించని వృద్ధుడు నీరు ఉన్న ఓ గుంతలో కూరుకుపోయాడు. దీన్ని గుర్తించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన వారు ఆ ప్రాంతానికి చేరుకుని గుంతలో నుంచి చొక్రోను బయటకు తీశారు. అయితే అప్పటికే వృద్ధుడు మరణించినట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న బత్తిలి ఎస్ఐ డి.అనిల్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని శవ పంచ నామా నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు చొక్రో కుమారుడు నిరంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా నదీతీరంలోని ఇసుక ర్యాంప్‌లో తవ్వకాలు జరపడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గుంతలు ఇంకెంతమందిని బలిగొంటాయోనని వాపోతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


చొక్రో (ఫైల్)

కారులో గంజాయి

- 148 కేజీల సరుకు స్వాధీనం

రామభద్రపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కొట్టక్కి చెక్‌పోస్టు వద్దకు సోమవారం తెల్లవారు జామున పోలీసులు చేరుకున్నారు. గంజాయి రవాణాపై వారికి అందిన సమాచారంతో ఆకస్మిక తనిఖీలకు దిగారు. ఒక్కో వాహనాన్ని ఆపి పరిశీలించారు. గంజాయి రవాణాదారులు కొద్దిదూరం నుంచి గమనించి కారు నిలిపారు. తప్పించుకునే మార్గం లేక కారును పొదల్లోకి మళ్లించి అక్కడే వదిలేసి పరారీ అయ్యారు. ఆపై పోలీసులు చేపట్టిన దాడుల్లో 148 కేజీల గంజాయిని పట్టుకున్నారు. బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఒడిశా నుంచి విశాఖ వైపు కారులో గంజాయిని తరలిస్తున్నారు. ఈ విషయం పోలీసులకు తెలిసింది. వెంటనే కొట్టక్కి చెక్‌పోస్టు వద్దకు సోమవారం తెల్లవారు జామున చేరుకున్నారు. వాహన తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసిన గంజాయి రవాణాదారులు కారును పొదల్లోకి మళ్లించి.. అక్కడే విడిచిపెట్టి పరారయ్యారు. అందులో ఉన్న 74 ప్యాకెట్లలో సుమారు 148 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని కారును స్టేషన్‌కు తరలించారు. నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. గంజాయి కేసులో నైట్ రౌండ్‌లో ఉన్న ఏఎస్ఐ ఆర్.అప్పారావు చాకచక్యంగా వ్యవహరించి సమాచారం తెలుసుకున్నారు.


కారులో ఉన్న గంజాయి ప్యాకెట్లు

బొమ్మ తొలగించేదెప్పుడో..?

- రీసర్వేలో ఇచ్చిన భూపట్టాలపై నాటి సీఎం జగన్ ఫొటో..
- ఇళ్ల స్థల పట్టాలదీ అదే తీరు..
- అప్పుడే తీవ్రంగా వ్యతిరేకించిన రైతులు, లబ్ధిదారులు
- పట్టించుకోని గత వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

6లో



ముగిసిన ఉరుసు మహోత్సవాలు



6లో

బోదను నిర్మూలిద్దాం: కలెక్టర్

బలిజిపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించి బోద వ్యాధిని నిర్మూలిద్దామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం పెదపెంకి గ్రామంలో ఫైలేరియా, నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురితో డీఈసీ, ఆల్బెండాజోల్ మాత్రలు మింగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో 222 మంది వరకు ఫైలేరియా బాధితులు ఉన్నారని తెలిపారు. భవిష్యత్ తరాలకు బోద వ్యాధి రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రత్యేక వైద్య బృందాలతో పరీక్షలు చేయిస్తున్నామన్నారు. మండలంలోని 57 వేల మందికి డీఈసీ మాత్రలు అందించ నున్నట్లు చెప్పారు. గర్భిణులు పడగడపున ఈ మాత్రలు వేసుకోరాదన్నారు. బోద వ్యాధి పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, వ్యాయామంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఇందుకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. తొలి మూడు రోజుల పాటు ఆరోగ్య కేంద్రాల పరిధిలో పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. 15 రోజుల తరువాత ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఎంఎల్‌పీఎస్‌లు ఇంటింటికీ వెళ్లి మాత్రలు మింగిస్తారని వెల్లడించారు. ఫైలేరియాకు కారణమయ్యే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లోని తడి, పొడి చెత్తలను వేరు చేసి సంపద కేంద్రాలకు పంపించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి బోద వ్యాధి బాధితులతో మాట్లాడారు. అనంతరం పెదపెంకి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి మోదీ వర్చువల్ పరీక్షపే చర్చ ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులతోపాటు కలెక్టర్ వీక్షించారు. ఆ తర్వాత విద్యార్థుల భవిత కార్డులను పరిశీలించారు. వారికి పౌష్టికాహారం అందించి రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి శాంతిప్రియ, డీఎంహెచ్‌వో భాస్కరరావు, వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.


పెదపెంకిలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

పార్వతీపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. మార్చి 17 నుంచి జరిగే టెన్త్ పరీక్షలకు 220 పాఠశాలల నుంచి 10,455 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. వారికి ఇబ్బందుల్లేకుండా బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. రైల్వేగేట్లు ఉన్న గ్రామాల నుంచి విద్యార్థులు ముందుగా బయలుదేరేలా చూడాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు.

డీఈవో ఎన్.తిరుపతినాయుడు మాట్లాడుతూ.. జిల్లాలో 67 పరీక్షా కేంద్రాలకు 67 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నట్టు తెలిపారు. సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో మార్చి 3 నుంచి ఇంటర్ , 17 నుంచి టెన్త్ పరీక్షలు జరగనున్నాయన్నారు. టెన్త్ పరీక్షలకు 560 మంది, ఇంటర్‌కు 426 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకానున్నట్టు చెప్పారు.

● అడుగడుగునా ఆలయాలు ● ప్రత్యేక రోజుల్లో ఎక్కడెక్కడి నుంచో భక్తుల రాక ● పెరుగుతున్న పర్యాటకుల తాకిడి

రాజాం.. ఆధ్యాత్మికధామం

రాజాం రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తాండ్ర పాపారాయుడు నివశించిన గడ్డ రాజాం. బొబ్బిలి రాజులకు అండగా ఉంటూ విజయనగరం రాజులపై పోరాటం చేసిన యోధుడాయన. ఇది చరిత్ర.. దేశ పారిశ్రామిక చిత్రపటంలో రాజాం పేరును లిఖింపజేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త జీఎంఆర్ పుట్టిన స్థలం రాజాం. అంతేకాదు ఆధ్యాత్మిక కేంద్రంగా కూడా రాజాం ఖ్యాతి పొందుతోంది. ఎన్నో ప్రముఖ దేవాలయాల సమాహారం.. మరెన్నో విశిష్టతలకు కేంద్రబిందువు ఈ పట్టణం.. వారంలో ఏడు రోజులూ పట్టణంలోని దేవాలయాలు కలకలలాడుతూ ఆధ్యాత్మికతను నింపుతున్నాయి.

సప్తమేధాగణ జ్ఞాన సరస్వతి

పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయం మరో ప్రత్యేకత. ఈ ఆలయంలో ప్రధాన సరస్వతి మాతతో పాటు యోగమారుతి, శ్రీవిద్యా గణపతి, దత్తాత్రేయ, హయగ్రీవ, మేధా దక్షిణామూర్తి, బృహస్పతి ఆలయాలు ఉన్నాయి. ఏడాది పొడవునా ఈ ఆలయంలో అక్షరాభ్యాసాలు జరుగుతునే ఉంటాయి.

17వ శతాబ్దం నాటి శివాలయం

బొబ్బిలి రాజులు 17వ శతాబ్దంలో నిర్మించిన శివాలయం ఇంకో ప్రత్యేకత. అప్పటో ప్రతిష్ఠించిన స్ఫటికలింగం ఈ ఆలయంలో ప్రత్యేకత. తాండ్ర పాపారాయుడు రాజాంలోని రాణావీధిలో నివాసం ఉండే కాలంలో నిత్యం కూరాకుల వీధిలో ఉన్న ఈ శివాలయాన్ని సందర్శించేవారని చరిత్ర చెబుతోంది. నాటినుంచి నేటి వరకూ ఎంతో ప్రముఖమైన దేవాలయంగా విరాజిల్లుతోంది. ఇదే కాకుండా రాజాంలో మల్లిఖార్జున దేవాలయం స్వయం భూదేవాలయంగా ప్రసిద్ధి చెందింది.

ఒకే ప్రాంగణంలో శివ వైష్ణవాలయాలు

శివుడు, విష్ణువు ఆలయాలు ఒకే చోట నిర్మితం కావడం అరుదుగా కనిపిస్తాయి. కాని డోలపేటలోని శ్రీ ఉమారామలింగేశ్వర ఆలయంలో ఒకే ప్రాంగణంలో ఈ రెండు ఆలయాలు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. వందల ఏళ్ల క్రితం బొబ్బిలి రాజుల హయాంలో నిర్మితమైన అత్యంత పురాతనమైన ఈ ఆలయ ప్రాంగణం నిత్యం భక్త జనసందోహంతో ఉంటుంది.

కలియుగ దైవం.. వెంకన్న ఆలయం

ప్రముఖ పారిశ్రామికవేత్త జీఎంఆర్, అతని సోదరులు నిర్మించిన బాలాజీ ఆలయాన్ని గతేడాది తిరుమల తిరుపతి దేవస్థానంకి అప్పగించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్మితమైన ఈ ఆలయం స్వామి శిష్యగణం సారధ్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ఇవే కాకుండా

● ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం రాజాంలో ఉంది. ఏడాది పొడవునా ఈ ఆలయంలో ఉత్సవాలు జరుపుతునే ఉంటారు.

● మహిళల ఆరాధ్య దైవం గాయత్రీ మాత ఆలయం కూడా రాజాంలోని గాయత్రి కాలనీలో భక్తుల పూజలు అందుకుంటోంది. ఈ ఆలయ ప్రాంగణంలో సూర్యదేవాలయంతో పాటు మరిన్ని ఆలయాలు ఉన్నాయి.

● వాసవీనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం, చీపురుపల్లి రోడ్‌లో శ్రీ ఆంజనేయ దేవాలయం పట్టణంలో వెలిసాయి.

● శ్రీ షిర్డీసాయి ఆలయంతో పాటు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సత్యం, శివం, సుందరం మందిరాలు పట్టణంలో ఉన్నాయి. వందలాది మంది సాయి భక్తులు ఈ ఆలయాలను సందర్శించి పూజలు చేస్తున్నారు.

● ఆదిదేవుడు గణపతితోపాటు అయ్యప్పస్వామి ఆలయం కూడా రాజాం పట్టణంలో ఉంది.

● బొబ్బిలి రాజుల హయాంలో రాణావీధిలో నిర్మించిన శ్రీ మహావిష్ణువు ఆలయం అత్యంత పురాతనమైనది. ఇవేకాకుండా మరెన్నో ఆలయాలు రాజాంలో ఆధ్యాత్మిక శోభను పెంపొందిస్తున్నాయి.

భక్తుల కల్పవల్లి పోలిపల్లి..


ఉత్తరాంధ్ర జిల్లాల భక్తుల కొంగు బంగారం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం.. పది దశాబ్దాల క్రితం విజయనగరం జిల్లా పోలిపల్లి గ్రామం నుంచి రాజాం వచ్చి వెలిసిన అమ్మవారికి కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుంది. ఏటా డోలా పౌర్ణమికి ముందు వచ్చే ఆది, సోమ, మంగళవారాలలో దేవదాయశాఖ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటుంది.



పోలిపల్లి పైడితల్లి అమ్మవారు

దేశంలో ఏకైక నవదుర్గ

పట్టణంలోని నవదుర్గ అమ్మవారి ఆలయం దేశంలో ఒకే ఒక్క ఆలయంగా చరిత్ర చెబుతోంది. సిద్ధిదాత్రిదేవితో పాటు బ్రహ్మీదేవి, మహేశ్వరీ దుర్గాదేవి, కౌమారీ దుర్గాదేవి, వైష్ణవీ దుర్గాదేవి, వారాహీ దుర్గాదేవి, ఇంద్రాణీ దుర్గాదేవి, ఛాముండా దుర్గాదేవి, మహాలక్ష్మీ దుర్గాదేవి ఒకే ఆలయంలో ఉండడం ఈ ఆలయం ప్రత్యేకత. తొమ్మిది మంది దుర్గమ్మలకు వేర్వేరుగా గోపురాలుండగా.. ప్రధాన అమ్మవారి గోపురం శ్రీచక్ర ఆకారంలో ఉంటుంది. ఆలయం ముందు ఛండి, ప్రచండి ద్వారపాలకులుగా ఉండగా, కాలభైరవుడు, ఋషిశృంగవుడు క్షేత్రపాలకులు ఉండడం ఇక్కడి మరో ప్రత్యేకత. ఏటా నవరాత్రి ఉత్సవాల సమయంలో ఈ ఆలయంలో హీనపక్షంగా 50వేల మంది భవానీదీక్షలు చేపడతారు. సింహద్వారం ఈ ఆలయ ఇంకో ప్రత్యేకత. ఆలయం దేవదాయశాఖ పరిధిలో ఉంది.



టీటీడీ ఆధ్వర్యంలోని బాలాజీ దేవస్థానం



నవదుర్గ దేవస్థానం ముందు ఛండి, ప్రఛండి విగ్రహాలు

పాఠ్యాంశాల రచనకు రాజాం ఉపాధ్యాయురాలు

● ఎంపిక చేసిన ఎస్‌సీఈఆర్‌టీ



వడ్డి ఉషారాణి

రాజాం రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అవసరమైన పాఠ్యాంశాల రచనలకు రాజాంకు చెందిన ఉపాధ్యాయురాలు వడ్డి ఉషారాణి ఎంపికయ్యారు. ఈమేరకు అమరావతిలోని ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) కార్యాలయంలో నాలుగు రోజులుగా ఉపాధ్యాయులతో నిర్వహించిన సెమినార్‌లో ఉషారాణిని ఎంపిక చేశారు. ఈమె ఆరు నుంచి పదోతరగతి వరకు పాఠ్య పుస్తకాల్లో విలువలతో కూడిన విద్య (వేల్యూ ఎడ్యుకేషన్), సమన్యాయం (జెండర్ ఈక్వాలిటీ), రాజ్యాంగ విలువలు (కానిస్టిట్యూషనల్ వేల్యూస్) అంశాలపై పాఠ్యాంశాలు తయారుచేసి ఎస్‌సీఈఆర్‌టీకి అందజేయనున్నారు. నిపుణులు తయారు చేసిన పాఠ్యాంశాలను ఈనెల 18, 19 తేదీలలో ఎస్‌సీఈఆర్‌టీ కార్యాలయంలో మేధావి వర్గం పరిశీలించి మార్పులు, చేర్పులు చేసి పాఠ్యపుస్తకాల్లో పొందుపరుస్తారు. ఉషారాణి రాజాం మున్సిపాలిటి పరిధిలోని బుచ్చెంపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఈమె రాష్ట్ర మహిళా ఉత్తమ ఉపాధ్యాయురాలిగానూ ఎంపికయ్యారు. అప్పటి విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. పాఠ్య పుస్తకాల తయారీలో పాఠ్యాంశాల రచనలో తనను భాగస్వామ్యం చేయడంపై ఉషారాణి సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాజ్యాంగ విలువలపై పాఠ్యాంశాల తయారీ ప్రక్రియ ప్రారంభించినట్లు ఉషారాణి ఆంధ్రజ్యోతికి సోమవారం వెల్లడించారు.

ముగిసిన ఉరుసు మహోత్సవాలు

● పులివేషాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు

విజయనగరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సూఫీ సెహన్‌షా హజరత్ సయ్యద్ ఖాదర్‌వలీ బాబా ఉరుసు, సుగంధ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. దేశ, విదేశాల నుంచి విచ్చేసిన భక్తులు దర్గాలో సుగంధ దవ్యాలు, వివిధ రకాల పుష్పాలు చాదర్ బాబాకు సమర్పించుకున్నారు. పులి వేషాలు, డప్పుల వాయిద్యాలతో నగరంలో ఊరేగింపు నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాల్లో విశ్వశాంతి కోసం పీఠాదుపతులు ప్రార్థనలు చేశారు. ఉత్సవాలకు పలువురు ప్రముఖులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ప్రభుత్వం అధికారికంగా అందించిన చాదర్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమర్పించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ బాబా దర్గా- దర్బార్ ముతావల్లీ ఖలీల్‌బాబు మాట్లాడుతూ ప్రపంచశాంతి కోసం సూఫీ శాంతి విధానాన్ని ప్రతిఒక్కరు పాటించాలని పిలుపునిచ్చారు. లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించామన్నారు. విశ్వశాంతిని ఆకాంక్షిస్తు ప్రేమ, దయాతత్వాలను ప్రబోధిస్తూ సూఫీ పీఠాధిపతి హజరత్ మహమ్మద్ అతావుల్లా షరీఫ్‌షా తాజ్ ఖాదరీబాబా ఆధ్యాత్మిక వారుసులు సజ్జాద్‌నషీన్ మహమ్మద్ ఖ్వాజా మెహియిద్దీన్‌షా ఖాదరీ బాబా దివ్యసందేశాన్ని అందించారు. బాబాకు ఫకీర్ మేళా ఖవ్వాలీలో భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



సుగుంధ ద్రవ్యాలు తీసుకుని ర్యాలీగా వెళ్తున్న భక్తులు



బాబావారి దివ్యసూక్తులను వివరిస్తున్న పీఠాధిపతులు

తమన్ డబుల్ సెంచరీ

● హైదరాబాద్‌పై ఆంధ్రా విజయం

విజయనగరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో ఆదివారం నుంచి జరుగుతున్న అంతర్రాష్ట్ర బాలురు అండర్- 14 సన్నాహక మ్యాచ్‌లో ఆంధ్రా 'బీ' జట్టు హైదరాబాద్ జట్టుపై విజయం సాధించింది. ఆంధ్రా జట్టు ఓపెనింగ్ బ్యాటర్ ఎస్.తమన్‌రెడ్డి అద్భుతంగా ఆడి డబుల్ సెంచరీ (227 బంతుల్లో 216 పరుగులు) సాధించారు. ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 407 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఆంధ్రా జట్టులో టాప్ ఆర్డర్ బ్యాటర్లు సీహెచ్ అక్షిత్ (70), ఎన్.జోగేందర్ (81 పరుగులు)లు అర్ధ సెంచరీలతో ఆంధ్రా టీం భారీ స్కోర్ నమోదు చేసింది. తొలి రోజు హైదరాబాద్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 82.4 ఓవర్లలో 276 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ జట్టు మిడిలార్డర్ బ్యాటర్ రాహుల్ నిఖిల్ సెంచరీ (134 పరుగులు) సాధించాడు.



అభివాదం చేస్తున్న తమన్ రెడ్డి

వైభవంగా ప్రతిష్ఠోత్సవం

● నందిగాంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

భోగాపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగాంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉమారామలింగేశ్వస్వామి పంచాయతన ఆలయ ప్రతిష్ఠోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇక్కడ పాత ఆలయం స్థానంలో ఇటీవల సుమారు రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన ఆలయంలో నవగ్రహ పీఠం ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో పార్వతీపరమేశ్వరులు, నంది విగ్రహాలు పుష్కరిణిని ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠోత్సవం అనంతరం వేదపండితులు, అర్చకులు హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సుమారు 20 వేలకు పైగా భక్తులు పాల్గొన్నట్లు అంచనా వేస్తున్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



అలంకరణలో స్వామివారు

బొమ్మ తొలగించేదెప్పుడో..?



● రీసర్వేలో ఇచ్చిన భూపట్టాలపై నాటి సీఎం జగన్ ఫొటో..
● ఇళ్ల స్థల పట్టాలదీ అదే తీరు..
● అప్పుడే తీవ్రంగా వ్యతిరేకించిన రైతులు, లబ్ధిదారులు
● పట్టించుకోని గత వైసీపీ సర్కారు
● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పాలనలో తనదైన ముద్ర చూపించాల్సిన గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో అన్ని వర్గాలనూ ఇబ్బందులకు గురిచేసింది. ప్రధానంగా భూ రీసర్వే ప్రక్రియను అస్తవ్యస్తంగా చేపట్టి.. రైతులకు జగన్ బొమ్మతో పట్టాలు , పాస్ పుస్తకాలు పంపిణీ చేసింది. ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు కూడా అదేవిధంగా పట్టాలు జారీ చేసింది. సర్వే రాళ్లపై కూడా నాటి సీఎం బొమ్మ ముద్రించారు. ఇందుకోసం కోట్లాది రుపాయల ప్రజాధనం వెచ్చించారు. అప్పట్లో దీనిపై తీవ్ర వ్యతిరేకత వచ్చినా నాటి సర్కారు పట్టించుకోలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా రైతులు పంట రుణాలు తదితర వాటికి నానా అవస్థలు పడుతున్నారు. పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల పరిధిలో నాడు జగన్ బొమ్మతో ఇచ్చిన పత్రాలను రద్దు చేసి డిజిటల్ పాస్ బుక్‌లు, ఇళ్ల పట్టాలను మళ్లీ జారీ చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 15 మండలాల పరిధిలో 'శాశ్వత భూహక్కు.. భూరక్ష' పేరుతో గత వైసీపీ ప్రభుత్వం 2020 డిసెంబరు 21న రీసర్వే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా 965 గ్రామాల పరిధిలో 5.78 లక్షల ఎకరాల్లో రీసర్వే చేయాల్సి ఉంది. కానీ పార్వతీపురం డివిజన్‌లో 176 గ్రామాల్లో 1.06 లక్షల ఎకరాల్లో రీసర్వే చేశారు. పాలకొండ డివిజన్‌లో 121 గ్రామాల్లో 59 వేల ఎకరాల్లో రీసర్వే చేశారు. వాటిలో 165 గ్రామాలకు చెందిన 2,926 మందికి అప్పటి ముఖ్యమంత్రి జగన్ బొమ్మతో శాశ్వత భూహక్కు పత్రం పేరుతో పట్టాలు ఇచ్చారు. అదేవిధంగా సుమారు ఆరు వేల మందికి నాటి సీఎం ఫొటోతో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. దీనిపై నాటి ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. తమ భూ పట్టాలపై జగన్ ఫొటో ఏమిటని ఎంతోమంది రైతులు, లబ్ధిదారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా పొలాల్లో వేసిన సర్వే రాళ్లపై జగన్ బొమ్మతో ఉండడంపై కూడా మండిపడ్డారు. ఈ సమస్యను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం సర్వే రాళ్లపై జగన్ బొమ్మ తొలగింపు చర్యలు చేపట్టింది. ఇందుకోసం రూ. 7.50 కోట్లు వెచ్చించింది.

గత ప్రభుత్వ హయాంలో భూ పట్టాల పంపిణీ ఇలా..

● గ్రామాలు - 165
● మొత్తం లబ్ధిదారులు - 2,926
● భూవిస్తీర్ణం - 2,201.61 ఎకరాలు
● ఇందులో ఎస్టీ లబ్ధిదారులు 1,148 - భూవిస్తీర్ణం 1,247.87 ఎకరాలు
● ఎస్సీ లబ్ధిదారులు 609 - భూవిస్తీర్ణం 347.77 ఎకరాలు
● బీసీ లబ్ధిదారులు 1,148 - భూవిస్తీర్ణం 587.38 ఎకరాలు
● ఓసీ లబ్ధిదారులు 8 - భూవిస్తీర్ణం 4.65 ఎకరాలు

వాటి సంగతేంటి..?

గతంలో పాస్ బుక్‌లు, టైటిల్ డీడ్ పుస్తకాలు ప్రభుత్వ ముద్రతో ఉండేవి. వాటిపై లబ్ధిదారుని ఫొటో, సంబంధిత తహసీల్దార్ సంతకం, ముద్ర ఉండేవి. 2014లో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు డిజిల్ పాస్ బుక్‌లు జారీ చేశారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. నాటి సీఎం జగన్ ఫొటోలతో 2019 తరువాత పాస్ బుక్‌లు, టైటిల్ డీడ్‌లు, ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు. అయితే ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములు, ఇళ్ల పట్టాలు, రైతులకు చెందిన భూముల విషయంలో ఈ విధంగా చేయడం సరికాదనే వ్యాఖ్యలు బహిరం గంగానే వినిపిస్తున్నాయి. అయితే జగన్ బొమ్మతో ఉన్న వాటి పరిస్థితి ఏమిటని రైతులు, లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.



గత వైసీపీ ప్రభుత్వానికి ముందు రైతులకు ఇచ్చిన పట్టాలు

ఆదేశాలు రాలేదు



గత వైసీపీ సర్కారు హయాంలో (2019-24) అప్పటి సీఎం జగన్ బొమ్మతో జారీ చేసిన పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్‌లు, ఇళ్ల పట్టాల మార్పు విషయంలో ఎటువంటి ఆదేశాలు రాలేదు. దీనిపై కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

- రెడ్డి పకీరు, ఇన్‌చార్జి తహసీల్దార్, జియ్యమ్మవలస

ఉప్పుగెడ్డ రోడ్డు పనులు ప్రారంభం

భోగాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టసబ్బన్నపేట, సబ్బన్నపేట గ్రామాల మధ్య ఉప్పుగెడ్డ వంతెన నిర్మాణ ం ఎట్టకేలకు ప్రారంభమైంది. ఈనెల 4న 'ఉప్పుగెడ్డ రోడ్డు నిర్మాణం ఇంకెప్పుడో?' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇక్కడి వంతెన నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం అదిగో ఇదిగో నిర్మిస్తామని కాలయాపన చేసింది. కూటమి ప్రభుత్వం 1. 6 కిలోమీటర్ల పొడువునా బీటీ రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. దీంతో పనులు మొదలయ్యాయి. గత మాదిరి ఉప్పుగెడ్డ వంతెన నిర్మాణం పైపులకు బదులు కాంక్రీట్‌తో గోడలు నిర్మించి దానిపై వంతెన నిర్మిస్తే మేలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

సెట్విజ్ సీఈవోగా సోమేశ్వరరావు

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన సర్వీసుల శాఖ సెట్విజ్ సీఈవోగా వయోజన విద్యా శాఖ ఉప సంచాలకుడు ఎ.సోమేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సీఈవోగా ఉన్న రాంగోపాల తన మాతృ శాఖకు వెళ్లడంతో కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జిగా సీఈవోగా బాధ్యతలు చేపట్టారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కవరపుకోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మాదేవిపేటలో మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి (ఇంగ్లీషు మీడియం) ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థుల నుంచి దర ఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

భూఆధార్ చేయించుకోండి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు భూ ఆధార్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.పూర్ణిమ సూచించారు. మండలంలోని చంద్రంపేటలో సోమవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. రైతులు త్వరితగతిన స్పందించి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు వేణుబాబు, రైతులు పాల్గొన్నారు.

●లక్కవరపుకోట: భూమి కలిగిన రైతులు తప్పనిసరిగా భూఆధార్ చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ ఏవో ఎం.స్వాతి సూచించారు. ఫిబ్రవరి 25లోగా రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వన్‌బీ, ఆధార్‌కార్డు లింక్ చేయబడిన ఫోన్ నెంబర్ ఇవ్వాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

మొయిదలో సీసీ కెమెరాలు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొయిద విజయరాంపురంలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ చెప్పారు. సోమవారం వాటిని లాంఛనంగా ప్రారంభించారు. గ్రామానికి చెందిన చందక రామకృష్ణ, భవిరెడ్డి శంకరరావుల సహకారంతో వీటిని ఏర్పాటు చేశామని తెలిపారు.

కలెక్టరేట్‌కు అర్జీదారులు

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను కలెక్టర్ అంబేడ్కర్ రద్దు చేశారు. అయినప్పటికీ సోమవారం జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు కలెక్టరేట్‌కు వచ్చారు. మెంటాడ మండలం పలు గ్రామాలకు చెందిన సర్పంచులు సమస్యలపై వినతులు అందజేశారు.

పరీక్ష పే చర్చ ప్రదర్శన

శృంగవరపుకోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండలం సంత గైరమ్మపేట ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8 తరగుతులు చదవుతున్న విద్యార్థులకు సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరీక్ష పే చర్చ 2025ను ప్రదర్శించారు. 21 ముఖ్యమైన సూచనలను ఆన్‌లైన్‌లో చూపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బంగారునాయుడు తెలిపారు. రామ్మూర్తి, ఎస్.ఈశ్వరరావు, జి.వెంకటరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎల్.వెంకటరావు తదితరులున్నారు.

ఖాదర్‌వలీ బాబా దర్గా సేవలు భేష్

చీపురుపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ఖాదర్‌వలీ బాబా దర్గా ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలకు ఎప్పుడు ముందుంటుందని వైసీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. సూఫీ మహా వేడుకల్లో ఆదివారం రాత్రి ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట ఎల్. ప్రభాత్‌కుమార్, పేకాపు ప్రసాద్, ఆనంద్, వెంకీ, చిన్నా తదతరులున్నారు.

నేడు ప్రసాదాల వేలం

వంగర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సంగాంలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి వచ్చేనెల 4 వరకు నిర్వహించనున్న జాతరలో ప్రసాదాల విక్రయాలకు మంగళవారం వేలం పాట వేయనున్నట్టు ఆలయ ఛైర్మన్ బోను ఆనందరావు ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.25 వేలు డిపాజిట్ చేయాలన్నారు.

గవిడిపేటలో అగ్నిప్రమాదం

గుర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవిడిపేటలో మందు గుండు సామగ్రి అమ్మే పర్ణశాలలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం, సూరిబాబు, టి.రమణ గాయాల పాలయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఎంను కలిసిన లలితకుమారి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి): శృంగవరపుకోట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం రాత్రి ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇందులో కొత్తవలస డిగ్రీ కళాశాల, ఎస్.కోట జూనియర్ కళాశాలకు అదనపు భవనాలు, ఇప్పటివరకు ఎమ్మెల్యే వద్ద ఉన్న వివిధ బాధితుల సీఎం రిలీఫ్ ఫండ్‌ఫైళ్ల క్లియరెన్స్ వంటి విషయాలు పొందుపరిచినట్లు లలితకుమారి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రాంప్రసాద్ తదితరులున్నారు.


సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

దేవాడను సందర్శించిన కలెక్టర్

గరివిడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో దేవాడలో తోటపల్లి కాలువ, మ్యాంగనీస్ గనులను కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఇటీవల తోటపల్లి కాలువ నుంచి వెళుతున్న నీరు దేవాడ, గుర్ల మండలంలోని సదానందపురంలో గల మ్యాంగనీస్ దిబ్బలలోకి వెళ్లిపోతోంది. తోటపల్లి కాలువ నీరు వృథా అవుతోందని, పొలాలకు సాగునీరు అందడం లేదని దేవాడ, సదానందపురం, దుమ్మెద తదితర గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సోమవారం సందర్శించి తోటపల్లి కాలువ సాగునీరు వృథా అవ్వకుండా చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జాతరపై అసత్య ప్రచారాలు వద్దు

శృంగవరపుకోట (జామి), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జామి ఎల్లారమ్మ జాతరపై అసత్య ప్రచారాలు చేయవద్దని మండల టీడీపీ నాయకులు కోరారు. సోమవారం స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండపంలో కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, మండల తెలుగు యువత అధ్యక్షుడు శంకర్, టీడీపీ నేతలు గొర్లె ఎర్నాయుడు, గనివాడ ఎర్నాయుడు తదితరులు విలేకర్లతో మాట్లాడారు. ఎల్లారమ్మ పండగ ఉత్తరాంధ్రలో అతిపెద్దదన్నారు. ఈఏడాది కమిటి లేకపోవడంతో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉందన్నారు. స్థానిక పెద్దలను కలుపుకుని జాతరను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సూచించారన్నారు. పార్టీలో ఎటువంటి గ్రూపులు లేవని స్పష్టం చేశారు.


సమావేశమైన టీడీపీ నాయకులు

ఉనికి కోసమే వైసీపీ నేతల తాపత్రయం

మెంటాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి ప్రజలు గుణపాఠం చెప్పినా ఆ పార్టీ నేతల బుద్ధి మారలేదని టీడీపీ మండల నాయకులు విమర్శించారు. సోమవారం మెంటాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు రెడ్డి ఎర్నాయుడు, జి.ముసలినాయుడు, ఎస్.కృష్ణమూర్తి తదితరులు మాట్లాడారు. జగన్ అభివృద్ధి చేసుంటే ప్రజలు ఎందుకు ఆయన్ని దించేశారని ప్రశ్నించారు. మంత్రి సంధ్యారాణి వాస్తవాలు మాట్లాడితే మాజీ మంత్రి రాజన్నదొరకు ఉలికి పాటు ఎందుకని నిలదీశారు. ప్రజలు వైసీపీని మరిచిపోతున్న సమయంలో ఉనికి చాటుకునేందుకు ఆ పార్టీ నేతలు ఉనికి చాటుకునేందుకు తాపత్రయపడుతున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు.

పశు వైద్యశాలల తనిఖీ

భోగాపురం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): భోగాపురం, ముంజేరు పశు వైద్యశాలలను జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డా.వైవి.రమణ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆసుపత్రుల్లో రికార్డులు, మందులు తదితర వివరాలను పరిశీలించారు. ఆయనతో ఏడీ మహాపాత్రో, పశు వైద్యాధికారి రామరాజు ఉన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

గరివిడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గరివిడిలో పశువైద్య కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తానని బీజేపీ రాష్ట్ర యువ మోర్చ అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ అన్నారు. సోమవారం కళాశాలకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల డీన్‌తో మాట్లాడారు. సమస్యలపై ప్రజాప్రతినిధులతో మాటాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తా మన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మన్నెపురి శ్రీనివాసరావు, పిల్లా నవీన్, జీవీ రెడ్డి, సరిది దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

త్వరలో సర్వీసు రోడ్డు పనులు

చీపురుపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఆర్వోబీకి సంబంధించి మెయిన్ గిడ్డర్, స్లాబ్ పూర్తయిన తరువాత సర్వీసు రోడ్ల నిర్మాణం ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈఈ కురిమినెల్లి మురళీబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆర్వో బీ లేట్' శీర్షికతో ఈనెల 10న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ పనులు రైల్వే శాఖ పరిధిలో జరుగుతున్నందున వారితో మాట్లాడినట్టు తెలిపారు.

మట్టి తవ్వితే చర్యలు

వంగర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితతే చర్యలు తప్పవని ఆర్ఐ రామారావు హెచ్చరించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'అరసాడలో మట్టి అక్రమ తవ్వకాలు' శీర్షికతో ప్రచురితమైన కథ నానికి తహసీల్దార్ స్పందించారు. అరసాడలో మట్టి తవ్వకాలపై విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని ఆర్ఐని ఆదేశించారు. ఏ చెరువులో మటి తవ్వినా చర్యలు తప్పవన్నారు.

రంగరాజన్‌పై దాడి.. శ్రీరాముడిపై దాడే

నెల్లిమర్ల, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి) తెలంగాణలోని చిలుకూరి బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌స్వామిపై దాడిని శ్రీరాముడిపై జరిగిన దాడిగానే పరిగణించాలని అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయ్‌శంకరస్వామి అన్నారు. నెల్లిమర్ల రామతీర్థంలో భజన బృందాలతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామరాజ్యం పేరుతో కొంత మంది వ్యక్తులు రాముడి స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పతివాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 5,223 మంది ఓటర్లు

●తుది జాబితా విడుదల● ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు సంబంధించి సోమవారం తుది జాబితా విడుదల అయింది. జిల్లావ్యాప్తంగా 5,223 మంది ఓటర్లు ఉండగా అందులో 3270 మంది పురుషులు, 1953 మంది మహిళలు. విజయనగరం ప్రాంతంలోని అత్యధికంగా 2,166మంది ఓటర్లు ఉండగా, పూసపాటిరేగ మండలంలోని 30మంది ఓటర్లు అత్యల్పంగా ఉన్నారు. అభ్యర్థులు నామినేషన్ ప్రక్రియ సోమవారం ముగిసింది. 10 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు.

ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించండి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయు లకు ఓటు హక్కు కల్పించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరరావు, రమణ కోరారు. ఈమేరకు ఎంఎల్ఏ లోకం నాగమాధవి, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వినతి పత్రాలు పంపించామని వారు తెలిపారు. ఈమేరకు సోమవారం వారు నెల్లిమర్లలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నో చట్టాలను మార్పు చేసిన కేంద్ర ప్రభుత్వాలు ఎమ్మెల్సీ ఓటు హక్కు విషయంలో సవరణలు చేయకపోవడం విచారకరమన్నారు.

భీమసింగి కార్మికులకు అండగా ఉంటాం

శృంగవరపుకోట (జామి), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భీమసింగి చక్కెర కర్మాగారం కార్మికులు, ఉద్యోగులకు అండగా ఉంటామని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. సోమవారం కర్మాగారం వద్ద కార్మికులతో సమావేశమయ్యారు. గత ప్రభుత్వ పనికిమాలిన చర్యలతో ఉద్యోగులు, కార్మికులు రైతులు తీవ్ర నష్టపోయారన్నారు. కార్మికులకు రావాలిసిన పీఎఫ్, గ్రాట్యూటీ, ఇప్పటికి చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టిసారించాలని కోరారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు లేఖరాస్తానన్నారు. కార్మిక, ఉద్యోగ నాయకులు ఉంగరాల శ్రీను, రౌతు కనకరాజు, విజయకుమార్, సిరికి వెంకటరావు తదితరులు వున్నారు.


మాట్లాడుతున్న లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి

'కొల్ల'కు పరామర్శ

సంతకవిటి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు మాజీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు కొల్ల అప్పలనాయుడు తండ్రి కొల్ల సూర్యనారాయణ (94) ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో సోమవారం మామిడిపల్లిలో రాజాం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి డా.తలే రాజేశ్, జడ్పీ వైస్ ఛైర్మన్ సిరిపురపు జగన్మోహన్‌రావు, వంగర ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్‌ముఖర్జీ, రాజాం మండల కన్వీనర్ లావేటి రాజగోపాల్‌నాయుడు, రాజాం జడ్పీటీసీ సభ్యుడు బండి నరసింహులు తదితరులు ఆయన్ని పరామర్శించారు. సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

టెండర్ల వాయిదా తగదు

గజపతినగరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాల టెండర్లపై వాయిదాలు వేయడం తగదని కల్లు గీత వృత్తిదారుల సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు అన్నారు. సోమవారం స్థానిక సచివాలయం ఆవరణలనిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదాలు వేస్తున్నట్లు చెప్పడాన్ని ఖండిస్తున్నామన్నారు. దుకాణాల కేటాయింపు వాయిదాల వెనుక బినామీల హస్తం ఉందని ఆరోపించారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ కొలుసు కోటారావు, బొండపల్లి మండల అధ్యక్షుడు సూరప్పడు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో పారిశ్రామికవేత్తలు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని విశాఖకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు వసుధ రామరాజు, శివప్రసాద్‌రెడ్డి, జమిందార్ నరసింహరాజు తదితరులు సోమవారం సందర్శించారు. విశ్వవిద్యాలయంలో అమలుచేస్తున్న కోర్సులుతో పాటు ఏఆర్‌వీఆర్ ల్యాబ్, 3డి ప్రింటింగ్, గైరో ప్లేన్, ఈ-వాహనాలు తయారీ, కుట్టు యంత్రాల యూనిట్, డ్రోన్‌ల తయారీ, పరిశోధన యూనిట్, అనాటమీ ల్యాబ్, టిష్యూ కల్చర్ యూనిట్ తదితర వాటి కోసం విశ్వవిద్యాలయం చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మొహంతి వారికి వివరించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ సన్నిడియోల్, డీన్ డాక్టర్ విజయ్‌బాబు ఉన్నారు.


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న పారిశ్రామికవేత్తలు

విద్యార్థులు ఆల్ రౌండర్లుగా ఎదగాలి

గరివిడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆల్‌రౌండర్లుగా ఎదగాలని తిరుపతికి చెందిన శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ జేవీ రమణ అన్నారు. గరివిడిలోని పశువైద్య కళాశాలలో సోమవారం రాష్ట్ర స్థాయి అంతర వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా, సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న పోటీల్లో రాష్ట్రంలోని 10 వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 104 మంది బాలికలు, 136 మంది బాలురు పాల్గొననున్నారు. పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఫేకర్స్ సీఈ ఎంఎస్ఎస్ శర్మ, కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు చివరి ఇంక్రిమెంట్

కొత్తవలస, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నో పోరాటాల ఫలితంగా రైల్వే శాఖలో జూన్, డిసెంబర్ నెలలో పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులకు చివరి ఇంక్రిమెంట్‌ను ఇస్తూ కేంద్ర జీవో జారీ చేసిందని సౌత్ కోస్ట్ ఆలిండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన కొత్తవలసలో విలేకరులతో మాట్లాడారు. ఎవరైతే జూన్ నెలాఖరున, డిసెంబరు నెలాఖరున పదవీ విరమణ చేశారో వారు చివరిలో ఇంక్రిమెంట్ రాక నష్టపోయేవారన్నారు. దాంతో కేంద్ర ప్రభుత్వం జీవోను జారీ చేసిందన్నారు. ఇందుకు కేంద్రప్రభుత్వానికి ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

భూసర్వేపై రైతుల అభ్యంతరం


చైతన్య సదస్సులో ఆర్డీవో సత్యవాణి

రేగిడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అంబఖండిలో సోమవారం రెవెన్యూ అధికారులు రైతులతో చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి, జిల్లా లాండ్ సర్వే అధికారి రమణ మూర్తి హజరయ్యారు. ఈ సందర్భంగా అంబఖండిలో గతంలో నిర్వహించిన రీసర్వే ప్రక్రియ తీరుతెన్నులపై రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సర్పంచ్ ప్రతినిధి శాసపు గోవిందరావు, రైతులు మాట్లాడుతూ గతంలో చేపట్టిన సర్వేలో అన్ రిజిస్టర్డ్ భూములు, వారసత్వ భూములు, ఏళ్ల తరబడి సాగులోని భూములకు రీసర్వేలో నమోదు చేయలేదన్నారు. సదస్సులో తహసీల్దార్ చిన్నారావు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

విద్యార్థిని మృతి

గుమ్మలక్ష్మీపురం/ కురుపాం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కురుపాం మండలంలోని లంకాజోడు గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని పువ్వల వాసవి(15) తన స్వగ్రామం అయిన జి.శివడలో పురుగు మందు తాగి మృతి చెందింది. నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లంకాజోడు ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న వాసవి తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందట చనిపోయారు. తమ బంధువులైన తోయక కూర్మారావు చిన్నప్పటి నుంచి పెంచుతున్నారు. రెండు రోజులు సెలవులు కావడంతో వసవి పాఠశాల నుంచి స్వగ్రామమైన జి.శివడ వచ్చింది. పంట పొలంకు వేసిన పురుగులు మందు ఇంటి వద్ద ఉంటే కూల్ డ్రింక్ అనుకునిని తాగినట్టు సంరక్షకుడు కూర్మారావు తెలిపారు. వెంటనే వాంతులు అవ్వడంతో స్థానిక మొండెంఖల్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోక్సో కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2024లో నమోదైన పోక్సో కేసులో మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఖైనపు హరీష్‌కు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయాధికారి కె.నాగమణి ఏడేళ్ల కఠిన కారగార శిక్షతో పాటు రూ. 3 వేల జరిమాన విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారని ఎస్పీ వకూల్ జిందాల్ ఓ ప్రకటనలో తెలిపారు. హరీష్ అదే గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలికపై 2024 నవంబరు 11న లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారన్నారు. 17 రోజుల వ్యవధిలోని అభియోగపత్రాలు న్యాయస్థానంలో దాఖలు చేయడంతో చేసి నిందితుడు జైలు నుంచి విడుదల కాకుండా ప్రాసిక్యూషన్ పూర్తికి భోగాపురం సీఐ రామకృష్ణ, ఎస్ఐ దుర్గాప్రసాద్ చర్యలు చేపట్టారన్నారు. దీంతో హరీష్‌పై నేరారోపణలు రుజువు కావటంతో పోక్స్ కోర్టు ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి శిక్ష ఖరారు చేశారన్నారు. హరీష్ 2023లో ఇదే తరహా నేరం పాల్పడటంతో ఆ కేసు ఇంకా కొనసాగుతోందన్నారు. ఈ కేసులో దర్యాప్తు అధికారులు, ప్రాసి క్యూ షన్ అధికారులను ఎస్పీ అభినందించారు.

బంగారం దుకాణంలో మహిళల చోరీ

పాలకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మణికంఠ జ్యూయలర్స్‌లో మహిళలు చోరికి పాల్పడ్డారు. సోమవారం సాయంత్రం మూడు గంటల సమయంలో నలుగురు మహిళలు షాపులో ప్రవేశించి చెవుల ఆభరణాలు చూపించాలని షాపు యజమాని గుమ్మడి సింధుకుమారిని అడిగారు. మాటల్లో పెట్టి బంగారు వస్తువులను దాచి, వాటి స్థానంలో మెటల్ వస్తువులు పెట్టారు. కేవలం నిమిషాల వ్యవధిలో గుర్తించిన యజమాని సింధుకుమారి బయటకు వచ్చి పిలుస్తుంటే ఆటోలో కోటదుర్గమ్మ ఆలయం వైపు ఉడాయించారు. దాంతో ఆమె పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారు. సుమారు రూ.1.5 లక్షల విలువైన బంగారు వస్తువులు పట్టుకుని వారు ఉడాయించినట్లు షాపు యజమాని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సారా విక్రయదారుల అరెస్టు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పార్వతీపురం మండలం పెదమరికి గ్రామ శివారులో రాజాన తేజ, దేవుపల్లి కల్యాణ్, గొర్లి నాగరాజు, గొర్లి అచ్యుతరావులను సోమవారం అరెస్టు చేసి, వారి నుంచి 520 లీటర్ల సారా, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్.సింహాద్రి తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఆదేశాలతో తనిఖీలు చేడుతుండగావీరు పట్టుబడ్డారన్నారు. దాడుల్లో హెచ్‌సీలు సుదర్శన్‌కుమార్, రాంబాబు, ఈసీలు, రాము, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్వతీపురం మండల పరిధిలో మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 23 మద్యం సీసాలను స్వాధీనం చేసు కున్నట్టు సీఐ సింహాద్రి తెలిపారు. డెంకాడ, మెంటాడ పరిధిలో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ ఎం.విజయలక్ష్మి తెలిపారు.

15 మద్యం సీసాలతో వ్యక్తి..

కొత్తవలస, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతపాలెంలో మద్యం సీసాలతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ జీఎస్ రాజశేఖరనాయుడు తెలిపారు. సంతపాలెం గ్రామ సమీపంలో దాడులు చేస్తుండగా గ్రామానికి చెందిన ఎన్.శ్రీవాసు 15 మద్యం సీసాలతో పట్టుబడ్డాడన్నారు. దాడుల్లో ఎస్ఐ వీఎన్ రాజు, సిబ్బంది రాముడు, ప్రసాద్, ఆదినారాయణ, రమేశ్, వి.పుష్పలత పాల్గొన్నారు.

● భోగాపురం: మండలంలోని తూడెంలో మద్యం బెల్ట్ దుకాణంపై సోమవారం దాడి చేసి మహిళను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. మద్యం అమ్మకాలు జరుగుతున్నాయనే సమా చారంతో దాడి చేసి ఆమెను అరెస్టు చేశామన్నారు. ఆమె నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, హెచ్‌సీ ప్రతాప్, సూర్యనారాయణ, శిరీష పాల్గొన్నారని తెలిపారు.

●నెల్లిమర్ల: మండలంలోని బొప్పడాంలో సోమవా రం నిర్వహించిన దాడుల్లో పది మద్యం బాటిళ్లతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు నెల్లిమర్ల ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్ముందు దాడులను కొనసాగిస్తామని సీఐ హెచ్చరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

గుర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపేట గ్రామంలో రామ లింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు కన్నుల పండువగా సోమవారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం మహా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్ భాస్కరరావు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రహరీ పనుల అడ్డగింత

భోగాపురం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపేటలో సోమవారం పాఠశాల ప్రహరీ పనులను టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. తమకు తెలియకుండా జనసేన కార్యకర్తలు పనులు ఎలా చేపడతారని టీడీపీ వర్గీయులు మండిపడ్డారు. టీడీపీ, జనసేనలకు సమానంగా కాకుండా జనసేన వర్గీయులకే ఎలా పనులు కేటాయిస్తారని పనులు అడ్డుకున్నారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండండి

రాజాం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జీడి, మామిడి తోటల సస్యరక్షణపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని గార్రాజు చీపురుపల్లిలో జీడి, మామిడి తోటల సస్యరక్షణపై రైతులకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డి నేటర్ ఎస్.ధృవ, జిల్లా ఉద్యాన శాఖాధికారి ఏవీఎస్ జమదగ్ని, మండల ఉద్యాన అధికారి ఉమామహేశ్వరి, సర్పంచ్ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.


సూచనలిస్తున్న శ్రీనివాసరాజు

ఘనంగా పరదేశమ్మతల్లి తీర్థం

వేపాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చినగుడిపాలలో సోమవారం గ్రామ దేవత పరదేశమ్మతల్లి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, సర్పంచ్ భోజంకి రామునాయుడు సారధ్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

భూములకు హక్కు పత్రాలు ఇవ్వండి

కొత్తవలస, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నిపాలెం గ్రామ రెవెన్యూలో సాగు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని 11 గ్రామాల రైతులు సోమవారం తహసీల్దార్ బి.నీలకంఠారావుకు వినతిపత్రం అందజేశారు. వందేళ్లుగాసాగు చేస్తున్నా అన్యాయమే జరుగుతోందని ఆవేదన వెలిబుచ్చారు.

సర్క్యులేషన్ నెట్‌వర్క్ ప్లాన్‌ల వివరాలు వెల్లడి



నెట్‌వర్క్ ప్లాన్ మంజూరు వివరాలు ప్రదర్శిస్తున్న అధికారులు

బొబ్బిలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి నూతనంగా జారీ చేసిన మార్గదర్శక విధానాల ప్రకారం మంజూరు చేసిన సర్క్యులేషన్ నెట్‌వర్క్ ప్లాన్ల వివరాలను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సోమవారం వెల్లడించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆమె ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారుల వెడల్పు తక్కువగా ఉండి, జనసాంద్రత, భవన నిర్మాణాల సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో భవన నిర్మాణ అనుమతులు పొందడానికి ప్రభుత్వం ఇటీవల సులభతరమైన విధానాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం సంబంధిత ప్రాంతాలలో సర్క్యులేషన్ నెట్‌వర్క్ ప్లాన్లు అనుమతి ఇచ్చేలా ప్రభుత్వం నూతన విధానాన్ని రూపొందించింది. బొబ్బిలి పురపాలక సంఘం పరిధిలో మొత్తం 16 సచివాలయాలు ఉండగా, ప్రతి సచివాలయం పరిధిలో ఈ తరహా సర్క్యులేషన్ నెట్‌వర్క్ ప్లాన్‌లకు ప్రతిపాదించామని కమిషనర్ తెలిపారు. ఈ మేరకు 12 సచివాలయాలకు సర్క్యులేషన్ నెట్‌వర్క్ ప్లాన్‌లు ఆమోదించామని, ప్రజల పరిశీలనార్థం వీటిని నోటీసు బోర్డులలో ప్రదర్శిస్తున్నామని ఆమె తెలిపారు. వీటిపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా వారం రోజుల్లోగా లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ కిరణ్‌కుమార్, టీపీవో రేవతి, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జూట్‌మిల్లు స్థలంలో రిజిస్ట్రేషన్లు వద్దు

బొబ్బిలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని పార్వతీపురం రోడ్డులో తారకరామాకాలనీకి ఎదురుగా గల పాత జూట్‌మిల్లు స్థలంలో ఎటువంటి రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు నిర్వహించరాదని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ రాశారు. ఇక్కడ హంగ్లీ జూట్‌మిల్లును పూర్తిగా తొలగించి నూతనంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇళ్ల స్థలాలు వేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్న సంగతి తెలిసిందే. పారిశ్రామిక జోన్‌లో ఉన్న ఈ ఖాళీ స్థలాన్ని ఇళ్ల స్థలాల జోన్‌గా అధికారికంగా తర్జుమా చేసుకోవాల్సి ఉంది. అలాంటి అనుమతులు ఏవీ లేకుండా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఇక్కడ ఇళ్ల స్థలాలను అనధికారికంగా అమ్మకునేందుకు చర్యలను ముమ్మరం చేశారు. వాస్తవానికి ఇక్కడ ఖాళీ స్థలం పన్ను రూపేణా మున్సిపాలిటీకి సుమారు రూ.30లక్షలు చెల్లించాల్సి ఉంది. ఎలాంటి రుసుంను చెల్లించకుండా, ల్యాండ్ కన్వర్షన్ లాంటివి చేయకుండానే ఎటువంటి ఇళ్ల స్థలాల వ్యాపారాలకు, రిజిస్ట్రేషన్‌కు అనుమతించరాదని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి లేఖ రాయడంతో పట్టణంలో చర్చనీయాంశమైంది.

పథకాలపై అవగాహన కల్పించాలి

బొబ్బిలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశపు హాలులో మెప్మా రిసోర్స్ పర్సన్లు, ఇతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15న ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి చెత్తసేకరణ వాహనానికి అందించే విషయంలో స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలన్నారు. టీపీఆర్‌వో జగన్మోహనరావు, సీఎంఎం లలిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, శానిటేషన్ సెక్రటరీలు, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇళ్ల స్థలాలపై సర్వే చేపట్టండి

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలపై సర్వే చేపట్టి, నివేదిక అందజేయాలని తహసీల్దార్ ఎం.శ్రీను వీఆర్వోలకు సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై సర్వే చేపట్టాలన్నారు. ఆయా స్థలాల్లో లబ్ధిదారులు కాకుండా ఇంకా ఎవరైనా ఉన్నారా అనే దానిపై విచారణ చేపట్టి, నివేదిక తయారు చేయాలని సూచించారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా భూఆధార్ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డీటీవో టీకేవీ సుబ్బారావు, ఆర్ఐ రాంకుమార్, ఈడీటీ గౌరీశంకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని సీఐటీయూ జిల్లా నాయకుడు బలసా శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్లతో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యలపై ఎంపీడీవో రత్నంకు వినతిపత్రం అందించారు. ● ఎస్.సీతారాంపురం గ్రామంలో గతంలో పనిచేసిన గ్రీన్ అంబాసిడర్లకు 16 నెలల జీతాలు ఇవ్వలేదని, వారిని విధుల నుంచి తొలగించారని, ఈ సమస్య పరిష్కరించాలని శ్రీనివాసరావు కోరారు.

17 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్

బాడంగి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జీజే కాలేజీలో సోమవారం నుంచి 17వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ విజయకుమార్ తెలిపారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కాలేజీ, అంబేడ్కర్ కళాశాల, టీఎల్ఎన్ స్కూల్ తోపాటు శేఖర్ మోడల్ కాలేజీ, అలాగే రామభద్రపురం మొత్తం 5 కాలేజీలకు సంబంధించి 226 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరైనట్టు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా మొదటిరోజు జరిగినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

కాలువ సరే.. రహదారి ఏదీ?

● 'పల్లె పండుగ' బిల్లులు విడుదలలో జాప్యం ● సగంలో నిలిచిన పనులు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నారసింహునిపేట పంచాయతీ పరిధి వెంకటరాయుడిపేట గ్రామంలో పల్లె పండుగలో భాగంగా డ్రైనేజీ కాలువలు నిర్మించారు. కానీ సీసీ రోడ్డు మాత్రం వేయలేదు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేయతలపెట్టారు. మొదట్లో ఈ పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించారు. కానీ గత కొన్నాళ్లుగా పనులు మందగించాయి. బిల్లులు విడుదల చేయడంలో జాప్యం కారణంగా పనులను సగంలో నిలిపివేసినట్టు గుత్తేదారులు చెబుతున్నారు. ● ఈ విషయంపై బొబ్బిలి డివిజన్ ఈఈ రమణమూర్తిని వివరణ కోరగా.. ఇప్పటివరకు చేసిన పనులకు చెల్లించాల్సిన బిల్లులను ప్రభుత్వానికి పంపించామని చెప్పారు. నిధులు విడుదల కాగానే గుత్తేదారుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు.



వెంకటరాయుడుపేటలో సీసీ రోడ్డు నిర్మించని దృశ్యం

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీ వార్మింగ్ డే



సీతానగరం: కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పార్వతీపురం మన్యం డీఎంహెచ్‌వో భాస్కరరావు



కురుపాం: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు



బొండపల్లి: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో రాణి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం 3,54,805 మందికి నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. 19 ఏళ్లలోపు వారికి 98.32 శాతం మాత్రలు వేశారు. నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డీఎంహెచ్‌వో డా.జీవనరాణి మాత్రలు వేయించారు. ● నెల్లిమర్ల: సతివాడ పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అచ్యుతకుమారి పర్యవేక్షించారు. ● బొండపల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అడిషనల్ డీఎంహెచ్‌వో రాణి సోమవారం నులి పురుగు నివారణ మాత్రలను వేయించారు. వైద్యులు పాల్గొన్నారు. ● సీతానగరం: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు పరిశీలించారు. వైద్యురాలు పావని, ఆర్‌బీఎస్‌కే పీవో రఘు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ● కురుపాం: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కురుపాంలో కేజీబీవీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం చేపట్టారు. రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చీకటి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ క్షేమంగా ఉండాలి



పైడిమారమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ క్షేమంగా ఉండాలని పైడి మారమ్మ తల్లిని కోరుకున్నట్టు ఎమ్మెల్యే విజయచంద్ర చెప్పారు. సోమవారం హెచ్.కారాడవలస గ్రామంలో పైడి మారమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పి.సత్యనారాయణ, శ్రీవాణి దంపతులు ఎమ్మెల్యేకి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు. టీడీపీ నాయకులు బి.సీతారాం, జీవీ రమణ, జి.రవి, ఎస్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సోమవారం సాయంత్రం నరిసిపురం గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పారు.

నేడు శంబర పోలమాంబ మూడో వారం జాతర

మక్కువ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శంబర పోల మాంబ అమ్మవారి మూడో వారం జాతర మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. అమ్మవారి లడ్డూ ప్రసాదం సిద్ధం చేశామని చెప్పారు. సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో 130 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్టు మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా శంబర గ్రామానికి బస్సులు నడపనున్నట్టు సాలూరు, పార్వతీపురం డిపో మేనేజర్లు తెలియజేశారు.



హుండీల లెక్కింపు

శంబర పోలమాంబ అమ్మవారి ఆలయాల హుండీల లెక్కింపును సోమవారం నిర్వహించారు. చదురుగుడి వద్ద ఉన్న ఆరు శాశ్వత హుండీలను తెరిచి లెక్కించగా రూ.14లక్షల 62వేల 984, వనంగుడి వద్ద ఆరు హుండీల ద్వారా రూ.4లక్షల 53వేల 199 ఆదాయం.. మొత్తం కలిపి రూ.19లక్షల 16వేల 183 వచ్చినట్టు ఆలయ ఈవో సూర్యనారాయణ తెలిపారు. ఈ హుండీల ఆదాయం మూడు నెలల 7 రోజులకు చెందినదని చెప్పారు. ఉత్సవ కమిటీ చైర్మన్ షైదాన తిరుపతిరావు, ఎంపీటీసీ తీల్ల పోలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అధిష్ఠానం మెప్పు కోసం స్టేట్‌మెంట్లు సరికాదు

సాలూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అధిష్ఠానం మెప్పు కోసం నచ్చినట్టు స్టేట్‌మెంట్లు ఇవ్వటం సరికాదని మాజీ ఎమ్మెల్యే పీడిక రాజన్నదొరను ఉద్దేశిస్తూ టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు హితవు పలికారు. పట్టణంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మంత్రి సంధ్యారాణికి వస్తున్న అపూర్వ జనాదరణ చూడలేక పోతున్నారని అన్నారు. అభివృద్ధిని అడ్డుకోవటానికి కోర్టు నోటీసులు ఇస్తున్నారని విమర్శించారు. పింఛన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలెండర్లు మీకు కనిపించటం లేదా అని ఎద్దేవా చేశారు. మండల నాయకుడు ఆముదాల పరమేష్ మాట్లాడుతూ ఏజెన్సీ సమస్యలు ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయా.. అని రాజన్నదొరను ప్రశ్నించారు. మత్స శ్యాం, డబ్బి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అనుమతితోనే పనులు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల తీర్మానం మేరకే పనులు చేపడతామని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. ఆమె సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో ప్రహరీలు లేని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఉపాధి నిధులు మంజూరైతే పంచాయతీలకు కాకుండా ప్రత్యేక వెండర్లకు పనులు అప్పగించాలని ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. అయితే సంబంధిత పనులకు పంచాయతీ తీర్మానం మేరకే అప్పగించాలని, లేదంటే పనులు అడ్డుకుంటామని పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారని ఆమె చెప్పారు. దీంతో పంచాయతీ తీర్మానం మేరకే పనులు మంజూరు చేసే అవకాశం ఉందని తెలిపారు. పంచాయతీల్లో మినీ గోకులాల నిర్మాణాలకు పంచాయతీ తీర్మానాలు అందించడం లేదని, ఈ సమస్యను కలెక్టర్, డ్వామా పీడీ దృష్టికి తీసుకు వెళ్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట ఏపీవో ఎం.గౌరీనాథ్ పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్యసేవలు

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అంబులెన్స్‌లో ప్రసవం-వైద్యసేవల్లో నిర్లక్ష్యం అనే శీర్షికతో ఈనెల 9న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈసందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ ఇకపై రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఐటీడీఏ పరిధిలోని అన్నీ పీహెచ్‌సీలకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి, రోగుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించి, సకాలంలో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ముందస్తు చర్యలతో ఫైలేరియా నిర్మూలన

బలిజిపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు ముందస్తు చర్యలు పాటిస్తే ఫైలేరియా వ్యాధిని శాశ్వతంగా నిర్మూలన చేయవచ్చని మలేరియా విశాఖ జోనల్ అధికారిణి డా.ఎం.శాంతిప్రభ అన్నారు. మిర్తివలస గ్రామంలో సోమవారం నిర్వహిస్తున్న ఎండీఏ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండీఏ కార్యక్రమంలో భాగా ప్రజలకు డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఆమె బలిజిపేట, పెదపెంకి, వంతరాం గ్రామాల్లో అమలవుతున్న ఎండీఏ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె వెంట జోనల్ ఆఫీసర్ ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరావు, వైద్య సిబ్బంది ఉన్నారు.



మిర్తివలసలో ఎండీఏ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా విశాఖ జోనల్ అధికారిణి శాంతిప్రభ

కలెక్టర్‌ను కలిసిన శేషుబాబు

పాలకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పాలకొండలోని సీతారామస్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు చామర్తి శేషాచార్యులు (శేషుబాబు) సోమవారం పార్వతీపురంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 19, 20, 21, 22 తేదీల్లో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని, కొత్త కలశ స్థాపనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలకు కలెక్టర్‌ను ఆహ్వానిం చారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

520 లీటర్ల సారా స్వాధీనం

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం పెదమరికి పంచాయతీ పరిధిలో సోమవారం అక్రమంగా సారా రవాణా చేస్తున్న నలుగురి ని అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ సీఐ సురేష్ తెలిపారు. పార్వతీపురానికి చెందిన ఆర్.తేజ, డి.కల్యాణ్, జి.నాగరాజు, జి.అచ్యుత్ కుమార్‌లు 520 లీటర్ల సారాను అక్రమంగా రవాణా చేస్తుండగా పార్వతీపురం ఎక్సైజ్ ఎస్ఐ నాగేశ్వరరావు తన సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. సారాను స్వాధీ నం చేసుకుని, నాలుగు వాహనాలను సీజ్ చేశామ న్నారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేశామని ఆయన చెప్పారు.

నలుగురి అరెస్టు

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణగూడ, చాపరాయిగూడ గ్రామాల సమీపంలో సారా కేసుల్లో పరారైన నలుగురిని సోమవారం పట్టుకుని, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వై.అమ్మన్నరావు చెప్పారు. గత ఏడాది నారాయణగూడ గ్రామ సమీపంలో స్థానిక పోలీసులు సారా అమ్మకాలపై దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో సారాను స్వాధీనం చేసుకోగా, ముగ్గురు పరారయ్యారు. అలాగే చాపరాయి గూడ గ్రామ సమీపంలో ఈ ఏడాది జనవరిలో సారా అమ్మకాల కేసులో మరో వ్యక్తి పరారయ్యారు. వీరిని సోమవారం గుర్తించి, అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలు ఊరేగిస్తున్న దృశ్యం

సాలూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్యామలాంబ అమ్మవారి ఉత్సవ ఘటాల ఊరేగింపు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. చిట్లు వీధి, చినయాత వీధి, రెడ్డిక వీధి, వడ్డి వీధితో పాటు పలు వీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. భక్తులు అమ్మవారి ఘటాలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

మన్యం బంద్‌ను విజయవంతం చేయండి

● పోస్టర్ల ఆవిష్కరణ
● నేడు, రేపు నిర్వహణ

సాలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం సాలూరు మండల కమిటీ నాయకులు వంతల సుందరరావు, గెమ్మెల జానకీరా వు కోరారు. ఈ మేరకు మండలంలోని మామిడిపల్లి గ్రామంలో కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1/70 చట్టాన్ని సవరణ చేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్రి మసి, లక్ష్మయ్యతో పాటు పలువురు గిరిజనులు పాల్గొన్నారు. ● గుమ్మలక్ష్మీపురం: ఈనెల 12న చేపట్టనున్న గిరిజన ప్రాంత బంద్‌ను విజయవంతం చేయాలని గుమ్మలక్ష్మీపురం ఎల్విన్‌పేట సర్పంచ్ గౌరీశంకరరావు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక వర్తక సంఘం నాయకుల వద్దకు వెళ్లి, తమ షాపులను మూసి బంద్‌కు సహకరించాలని కోరారు. ● సీతంపేట: మన్యం ప్రాంతంలో ఈనెల 12న నిర్వహించనున్న ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని ఏజేఏసీ మండల అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు కోరారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గిరిజన సంఘాల నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

లీకులు బాబోయ్.. లీకులు

● తరచూ నీటి సరఫరాకు అంతరాయం

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలో కాలం చెల్లిన పైపులైన్ల కారణంగా గత కొన్నేళ్లుగా ప్రధాన రహదారితో పాటు ఆయా వీధుల్లో లీకులు ఏర్పడుతున్నాయి. దీంతో తరచూ తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా ఈ సమస్యకూ పూర్తిస్థాయిలో ఎవరూ పరిష్కారం చూపడం లేదు. ● ఈ విషయమై మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఏఈ అప్పారావును వివరణ కోరగా లీకుల మరమ్మతుల కోసం, పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ నిర్మాణం చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉందన్నారు.

న్యూస్ బాక్స్

13న తోటపల్లి హుండీల లెక్కింపు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాలలో ఈనెల 13న హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 12న పవిత్ర నాగావళి నదీ తీరంలో స్వామివారికి, అమ్మవార్లకు శ్రీచక్ర స్నానం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గల భక్తులు నిబంధనల మేరకు లెక్కింపులో పాల్గొనవచ్చన్నారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

వీరఘట్టం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సొంత భూమి ఉన్న ప్రతి రైతూ ప్రత్యేక విశిష్ట సంఖ్యను పొందాలని మండల వ్యవసాయాధికారిణి సౌజన్య తెలిపారు. ఆమె సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్‌కార్డు తరహాలో అందిస్తోందని చెప్పారు. రైతు సేవా కేంద్రానికి వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థుల ఇంటికి వెళ్లి పరిశీలన

వీరఘట్టం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తలవరం జడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలోని ఉన్న పనుకువలస గ్రామంలో ఎంఈవో ఆనందరావు సోమవారం రాత్రి పర్యటించారు. పదో తరగతి విద్యార్థులున్న ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల లక్ష్యంగా కృషి చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం వై.జగన్, ఉపాధ్యాయులు కె.శివ ప్రసాద్, కె.జనార్ధనరావు, వై.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

సీతానగరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు ఆదేశించారు. కాశీపేట స్వర్గధామానికి వెళ్లే రహదారిలో నిర్మించిన కల్వర్టు, అప్పలనాయుడు చెరువు సమీపంలో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ఆయన సోమవారం పరిశీలించారు. మండలానికి మరో 80 గోకులాల షెడ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్, డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.

పల్లె పండుగ పనులు వేగవంతం చేయాలి

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమంలో గుర్తించిన పనులను పూర్తి చేయాలని డ్వామా పీడీ రామచంద్రరావు ఆదేశించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పాలకొండ నియోజకవర్గంలో పనిచేస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెటీరియల్ కాంపొనెంట్ కింద చేపట్టిన నిర్మాణ పనులకు ఈనెల 28వ తేదీలోగా బిల్లులు చెల్లించాలని ఆయన ఆదేశించారు. గోకులాలు, పాఠశాలల ప్రహరీ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కెగీతాంజలి, భామిని ఇన్‌చార్జి ఎంపీడీవో కె.సత్యం పాల్గొన్నారు.

సభ్యత్వానికి ముందుకు వస్తున్నారు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల అభివృద్ధికి పలువురు దాతలు ముందుకు వస్తున్నారని అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డా.డి.పారినాయుడు తెలిపారు. సోమవారం నూతన దేవస్థానం ఆవరణలో దివంగత ఉద్యమ నాయకుడు ఆదిభట్ల కైలాసం కుమారుడు ఆదిభట్ల శ్రీనివాసరావు అభివృద్ధికి ముందుకు వచ్చి సభ్యత్వంగా రూ.11,116 చెల్లించారు. మొత్తం సభ్యత్వాల రూపంలో రూ.52లక్షల 72వేల 642 వచ్చాయని తెలిపారు. అలాగే విరాళాలుగా రూ.94లక్షల 49వేల 179 వచ్చాయని ఆయన తెలియజేశారు. ఆలయాల నిర్మాణాలకు సుమారుగా రూ.7.50కోట్లతో ప్రతిపాదనలు చేశామని పారినాయుడు చెప్పారు.

చంద్రపూర్ సమితిలో వినతుల స్వీకరణ

ఒడిశా

రాయగడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చంద్రపూర్ సమితిలో కలెక్టర్ పారుల్ పట్వారి అధ్యక్షతన సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జడ్పీ కార్యనిర్వాహణాధికారి అక్షయ్ ఖెముండు తదితరులు పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 33 ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన కలెక్టర్.. నలుగురికి చికిత్స నిమిత్తం రూ.25వేలు అందజేశారు. ఒక దివ్యాంగునికి బ్యాటరీ ట్రైసైకిల్ పంపిణీ చేశారు.